# ఎన్నోరంగుల తెల్లకిరణం

## - సిరివెన్నెల సీతారామశాస్త్రి



*(సిరివెన్నెలగారు వ్రాసిన కథలు నెలకొకటి)*

***సంకల్పం***

సాహిత్యంలో 'కథ' (short story)కి సంబంధించిన నిర్వచనాలూ, నియమావళి, ఆవిర్భావం. ఆకృతి, పరిణామము, పరిణితి ఇత్యాది అంశాలపట్ల నాకు నిర్దిష్టమైన అవగాహన ఉంది - అని నేను అనుకోను. కథా సామ్రాజ్య నిర్మాతల, నిర్ణేతల సరసన నిలచి తర్కించే తాహతు నాకుందని కూడా అనుకోలేను.

'ఏం చెప్పాలి' అనే దానికన్నా 'ఎలా చెప్పాలి?' అనే అంశంపట్లే నాకు ఎక్కువ మక్కువ.

కనుక, నా కథల్లో ఇంతవరకు స్పృశించబడని, కనని, వినని అపురూపమైన 'వస్తువు' ఉందని దబాయించను.

కథా కథన విధానంలో, రసపోషణ, నిర్వహణ వగైరా సాంకేతికాంశాలపట్ల నాకున్న పరిజ్ఞానం బహు తక్కువ.

'కథ చెప్పడం' అనేది ఎప్పుడో అయిపోయింది - "with all its totality & perfection" అనేది నా నమ్మకం.

'ఎలా చెప్పడం' అనేది ఎప్పటికీ అయిపోదు అనేది కూడా నా నమ్మకం.

'అతి పాత', 'మామూలు' విషయాలే ఒక్కొక్కప్పుడు నా గుండెను కొత్తగా, బలంగా 'తాకిన' అనుభూతి కలిగినప్పుడు, ఆ అనుభూతిని యథాతథంగా 'మాటల్లో'కి అనువదించడానికి నేను చేసిన ప్రయత్నాన్ని చాలామంది కథా సాంకేతిక నిపుణులు 'ఇది, ఇలాంటిది కథే కాదు పొమ్మన్నారు.'

'కాబోసు' అనుకున్నాను గాని, తెగబడి 'ఏం? ఎందుక్కాదు?' అని ఎదురు తిరిగే ప్రయత్నం చెయ్యలేదు. 'కానీలే! నాదో 'మాలోకం' అయి ఉంటుందని ఊరుకున్నాను.

నా 'మాలోకం'లో జనాభా లెక్కల సేకరణ జరిగితే, నేను గాక ఇంకా ఎవరైనా ఉన్నారా, ఉంటారా అని తెలుసుకోవాలనే నా ఆరాటం గత ముప్పై సంవత్సరాలుగా నన్ను వెన్నంటే ఉంది.

ఆ 'రీసెర్చి'లో భాగంగా ఇలా నా 'స్వగతాలన్నీ' ఓ సంకలనంగా పోగుచేసి అన్వేషణకి పంపిస్తున్నాను.

*(సీతారామశాస్త్రి)*

*కార్తికేయుని కీర్తికాయం*

**కెవ్వున కేక** వేయబోయి చటుక్కున కళ్ళు తెరిచాను. కేక వేశానామో నాకే తెలీదు. కళ్ళు తెరిచిన కొన్ని సెకన్లకి గాని తెలియలేదు, కలలోంచి మేలుకున్నావని. అబ్బ! చాలా భయంకరమైన కల. అదేమిటో కొంచెం కూడా గుర్తుకురావడం లేదుగాని, నేను ఉన్న రైలు పెట్టెమీద, ఆకాశంలోంచి బండరాళ్ళు దడదడా, దబదబా వర్షంలా పడిపోతుండగా మెలుకువ వచ్చింది.

దబదబా, దడదడా శబ్దం మళ్ళీ వినిపించింది. ఉలిక్కిపడ్డాను. ''కిరీటిగారూ!'' ఎవరో గట్టిగా గొంతుచించుకుని అరుస్తున్నారు. పూర్తిగా మెలుకువ వచ్చి మత్తు వదిలింది. ఎవరో పిలుస్తున్నారు. వీధి తలుపు బాదుతున్నారు. ఆ శబ్దం, నా కలలోని చివరి దృశ్యంలోని శబ్ధం ఒకటే.

గబగబా మంచం దిగాను, కాళ్ళు వణుకుతున్నాయి. గుండెదడ ఇంకా తగ్గలేదు. మళ్ళీ తలుపు చప్పుడవడం ఎవరో నన్ను పిలవడం వినిపించాయి.

''వస్తున్నా! వస్తున్నాను'' గట్టిగా అరిచాను, కంఠం వణికింది. గొంతు చించుకుని అరుస్తున్నారు. పూర్తిగా మెలుకువ వచ్చి మత్తు వదిలింది. ఎవరో పిలుస్తున్నారు. వీధి తలుపు బాదుతున్నారు. ఆ శబ్దం, నా కలలోని చివరి దృశ్యంలోని శబ్దం ఒకటే.

గబగబా మంచం దిగాను, కాళ్ళు వణుకుతున్నాయి. గుండెదడ ఇంకా తగ్గలేదు. మళ్ళీ తలుపు చప్పుడవడం, ఎవరో నన్ను పిలవడం వినిపించాయి.

''వస్తున్నా! వస్తున్నాను'' గట్టిగా అరిచాను, కంఠం వణికింది. గొంతు తడారిపోయిందేమో, శబ్ధం గొట్టంలోంచి గాలి ఊదినట్లు వచ్చింది. అంత భయపడి పోయానా! అనుకున్నాను. లుంగీ సద్దుకుంటూ, గబగబా వీధి తలుపుకేసి బయలుదేరాను.

''కిరీటిగారూ! తలుపు తెరవండి సార్!'' ఏడుపు వినిపించింది ఆ కంఠంలో. అ పిలుస్తున్నది కార్తికేయమూర్తి తమ్ముడు ఆదిత్యమూర్తిది కదూ!

కాకపోవడమేమిటీ? తలుపు తెరవగానే అతనే. పద్దెనిమిదేళ్ళ కుర్రాడు. అసలే ఎర్రగా ఉంటాడేమో, ఇప్పుడు అతని మొహం మరీ ఎర్రగా కందిపోయివుంది. కళ్ళు ఎర్రగా ఉబ్బివున్నాయి. ఒకటే కన్నీళ్ళు.

''అదీ! నువ్వా! ఈ వేళప్పుడు?'' అన్నాను. తెలతెలవారుతోంది. నన్ను చూసీచూడగానే. ''సార్! అన్నయ్య.. అన్నయ్య'' అంటూ బావురుమన్నాడు.

నాకు గుండె జారిపోయింది. కాళ్ళవణుకు నిగ్రహించుకోలేక, గుమ్మానికి జారబడి కూర్చుండిపోయాను. ''ఏం జరిగింది?'' అన్నాను, నీరసంగా.

''మీరు త్వరగా రండి సార్! వదిన గగ్గోలు పెట్టేస్తోంది. నాకు చాలా భయంగా వుంది మీక్కూడా ఒక ఉత్తరం వుంది'' ఆదిత్యమూర్తి. వెక్కిళ్ళ మధ్య చెప్పిన ఈ మాటల్లో ఒక్క ముక్క కూడా అర్థంకాలేదు నాకు.

''నన్ను నేను సర్దుకునేసరికి అయిదు నిముషాలు పట్టింది.'' వస్తున్నాను. ''బట్టలు వేసుకుని వచ్చేయడమే. అసలేం జరిగిందో నువ్వు సరిగా చెప్పు. కార్తికి ఏమైంది?''

''ఏమో! అదే తెలీడం లేదు. ఇంట్లో లేడు.''

ఒక్క పిసరు ఆందోళన తగ్గింది నాకు. జరగకూడనిదేమీ జరగలేదు అన్న సంగతి కాస్త స్థిమిత పరచింది. మళ్ళీ ప్రశ్నించే సరికి, క్లుప్తంగా జరిగిందంతా చెప్పాడు ఆదిత్యమూర్తి. అది వినేసరికి మళ్ళీ గుండెలు కొట్టుకోవడం మొదలు పెట్టాయి. కీడు ఏదీ స్పష్టంగా కనిపించకపోయినా, మనస్సు కీడునే శంకిస్తోంది.

శ్రీమతిని లేపాను. ఇంతలో పాలుకూడా వచ్చాయి. అర్జంటుగా కాఫీ పెట్టమని చెప్పి, హాల్లోకి వచ్చి –

''అదీ! నువ్వు బెంబేలు పడడం మానేసి, అలా కాసేపు సోఫాలో కూర్చో. కీడు శంకించకు. ఏవీ జరిగి వుండదు. అంతా సవ్యంగానే జరుగుతుంది. నేను అయిదు నిముషాల్లో మొహం కడుక్కుని వస్తాను.'' అని ఆదిత్యమూర్తికి చెప్పి, వంటింట్లోకి వెళ్ళాను. ఒక గ్లాసులో గ్లూకోజు నీళ్ళు కలుపుకుని తాగుతూ, క్లుప్తంగా శ్రీమతికి సంగతి చెప్పి, బాత్రూంలో దూరాను.

స్నానం చేసాక, శరీరం స్వాధీనంలోకి వచ్చింది. ఆ పీడకల, వెంటనే ఈ వార్త నన్ను, ఆకుని తుఫానుగాలి అల్లల్లాడించేసినట్లు చేసాయి. అబ్బ! ఎంత పాడుకల. ఇంతకీ ఈ కార్తిగాడు. ఏ అఘాయిత్యానికీ సిద్ధపడలేదుకదా!

వేడివేడి కాఫీ గొంతులో దిగేటప్పటికి, ఆదిత్యమూర్తికూడా ఆ ఉద్భుతం నుంచి తేరుకున్నాడు. ఇద్దరం బయలుదేరాం. ఇల్లు తాళం పెట్టి తనూ వస్తానంది శ్రీమతి. వెనకాల రమ్మని చెప్పి నేను గబగబా అడుగు ముందుకేశాను. వీధికి ఇటు చివర్న మా ఇల్లు - అటు చివర్న కార్తికేయమూర్తి ఇల్లు. రెండు నిముషాల్లో చేరుకున్నాం.

అప్పటికప్పుడే ఇంటిముందు అయిదారుగురు జనం చేరారు. "చుట్టుపక్కల అందరికీ తెలిసిపోయిందా?" అన్నాను ఆదిత్యమూర్తితో. "లేదనుకుంటాను. అంతా జరిగి అరగంట కాలేదు. వదిన ఉత్తరాన్ని చూస్తూనే నన్ను లేపింది. నేను ఉన్నపళంగా మీ దగ్గరకి పరిగెత్తుకు వచ్చాను."

"అయితే, తక్షణం ఏదో ఒకటి చెప్పి, వీళ్ళని పంపించేయ్. మీ అమ్మగారికి మళ్ళీ ఫిట్లు వచ్చాయనో ఏదో ఒకటి చెప్పు. ఈ విషయం మాత్రం బయటకి రాకుండా వుండాలి." అంటూ నేను గబగబా లోపలికి వెళ్ళాను.

లోపలనుంచి సన్నగా ఏడుపులు వినిపిస్తున్నాయి. తిన్నగా కార్తి బెడ్‌రూంలోకి వెళ్ళాను. మంచం మీద కూర్చుని కార్తి భార్య అమృతవల్లి, ఆమెను పొదవిపట్టుకుని కార్తి తల్లి, పక్కనే నిలబడి కార్తి చెల్లెళ్ళిద్దరూ అందరూ వెక్కివెక్కి ఏడుస్తున్నారు. కార్తి పెద్దకొడుకు, మూడేళ్ళవాడు, బిక్కుబిక్కుమంటూ చూస్తున్నాడు. కార్తి రెండో సంతానం, పదినెల్ల పసిపిల్ల ఉయ్యాల్లో పడుకుని నిద్రపోతోంది.

"చెల్లాయ్!" అంటూ దగ్గరకు వెళ్ళాను. నన్ను చూడగానే "వచ్చావా కిరిటీ" అంటూ బావురుమన్నారు కార్తి అమ్మగారు, ఒక్కసారి ఘొల్లుమన్నారు అందరూ. నాకు కళ్ళంట నీళ్ళు తిరుగుతున్నాయి. "చూడమ్మా! చెల్లాయ్! ఇలా చూడూ ఒక్క క్షణం ఒక్క క్షణం అందరూ ఊరుకోండి. ప్లీజ్. నేను చెప్పేది వినండి."

కాస్త శాంతించారు. అంతా. కీర్తి చెల్లెళ్ళవైపు తిరిగి, "అమ్మలూ! కాస్తా నాకు కాఫీ కలిపి తీసుకురండి. వెళ్ళండి. ఏం జరగలేదుకదా? ఏమీ జరగదు కూడా" అని వాళ్ళని లోపలికి పంపేసాను. కార్తికేయమూర్తి భార్యని, తల్లిని చూస్తూ గబగబా చెప్పాను.

"చూడండమ్మా! ఇప్పటివరకూ ఏమీ జరిగినట్టు మనకి రూఢిగా తెలీదు. అది గుంభనంగా వుండాలి. లేకపోతే అల్లరైపోతాం, ఇప్పుడిప్పుడే చుట్టుపక్కల వాళ్ళు నలుగురూ చేరుతున్నారు కూడాను. ఎటుపోయి ఎటొచ్చీ అంతా సవ్యంగా ముగిసినా, ఇప్పుడిలా మనం బేల పడడం వల్ల, శాశ్వతమైన అప్రతిష్టా, అల్లరీ మాత్రం మిగిలిపోతాయి. పైగా పోలీసులూ, వ్యవహారమూ అంతా నానా అల్లరీ అయి, వాడి ఉద్యోగం మీదికి కూడా వస్తుంది" ఇంకా ఏదో చెప్పబోతూ వుండగా, మధ్యలో అందుకుని, "ఇంకా ఎక్కడి ఉద్యోగం అన్నయ్యగారూ!" అంటూ ఘొల్లుమంది అమృతవల్లి. అంటూనే తన ఒళ్ళో ఉన్న పొడుగాటి కవర్లు నాకు అందించింది.

అందుకుని చూసాను. ఒకొక్క కవరు మీద ఒకొక్క అడ్రస్ వుంది. ఒకటి తన ఆఫీసర్‌కి, ఒకటి అమృతవల్లికి, ఒకటి నాకు, ఒకటి తన తల్లికి, ఒకటి తమ్ముడికి, ఒకటి మావగారికీ, ఒక రెండు కవర్లు ఇద్దరు స్నేహితులకీ, ఒకటి తన పెద్ద తండ్రికీ, మొత్తం పది కవర్లు. పదో కవరు మీద 'వ్యవస్థకి' అని వుంది. మొత్తం పది కవర్లలోనూ కలిపి, ఎంత లేదన్నా నూరు, నూటయాభై అరఠావుల కాగితాలు వుండచ్చు.

ఒక్క తనకూ, అత్తగారికీ రాసి వున్న కవర్లు మాత్రమే తెరిచింది అమృతవల్లి. ఆ కవర్లన్నీ చేత్తో పట్టుకుని అమృతవల్లికేసి చూసాను.

"తెల్లవార్లూ కూచుని రాసినా, ఇన్ని పేజీలు ఒక్క రాత్రిలో రాయలేడే!?" అన్నాను సాలోచనగా ఆమె కేసి చూస్తూ.

"నాలుగైదు రోజులుగా రోజూ రాత్రి బాగా పొద్దుపోయేవరకు రాస్తున్నారు. ఏమిటని అడిగాను. ఆఫీసు పని అన్నారు. టేబుల్ మీద ఉన్న రెండు మూడు ఫైళ్ళు చూసి, కాబోలు అనుకున్నాను. ఆఫీసు పని అన్నారు. టేబుల్ మీద ఉన్న రెండు మూడు ఫైళ్ళు చూసి, కాబోలు అనుకున్నాను. ఆఫీసు ఫైళ్ళు ఇంటికి తీసుకువచ్చి పని చెయ్యడం ఆయనకి అలవాటే కదా అనుకుని వివరం అడగలేదు."

"ఈ మధ్య మనిషిలో ఏమైనా తేడా కనిపించిందా?"

"నాలుగైదు రోజులుగా అదోలా వున్నారు, కారణం ఎంత అడిగినా ఏమీ చెప్పలేదు. ఆఫీసులో పని ఎక్కువగా వుందని మాత్రం అన్నారు. ఒక అరడజను సార్లైనా మీ గురించి అనుకున్నారు. "సమయానికి వీడు ఊళ్ళో లేకుండా పోవాలా?" అని నిన్న ఉదయం అన్నారు మీ గురించి. నిన్న ఆఫీసు నుంచి చాలా ఆలస్యంగా వచ్చారు. రాగానే మీరు వచ్చారని చెప్పాను. 'ఇంతరాత్రప్పుడేం వెళ్తాను. ప్రయాణపు అలసటతో పడుకుని ఉంటాడు. రేపు చూసుకోవచ్చులే" అన్నారు.

"ఈ మధ్య మళ్ళీ కొత్త ఇబ్బందులేవైనా అదే డబ్బు సమస్యలు?" నసిగాను.

"కొత్తగా ఏముంటాయి నాయనా! ఎప్పుడూ ఉండేవే. అప్పులు చెయ్యకురా నాయినా, అని చిలక్కి చెప్పినట్టు చెప్పాడు. విన్నాడు కాదు. అవే ఇంత కొంపముంచాయి" అంటూ, మళ్ళీ బావురుమన్నారు కార్తి అమ్మగారు.

నేనేం మాట్లాడలేదు. పిల్లలు కాఫీ తెచ్చి ఇచ్చారు. తాగుతూ, కుర్చీలో కూర్చుని ఒకొక్క కవరే విప్పి చదవడం మొదలెట్టాను నిశ్శబ్ధంగా.

నాకు తెలియని కొత్త విషయాలేం లేవు. అదే ధోరణి. కాస్త అతిగా విస్తరించి వుంది. అంతే! ఇది వరకు ఎన్నో వందలసార్లు వాడు నాతో చెబుతున్నప్పుడు కలగని ఏదో దుఃఖం, ఆవేదనా గుండెల్లోంచి తన్నుకొస్తున్నాయి. ఒకొక్క ఉత్తరం చదువుతూ ఉంటే నాకు ఆశ, నమ్మకం దిగజారిపోతూ, ఆందోళన ఎక్కువౌతోంది.

"నువ్వు నా డైరీవి రా. నువ్వు పక్కన లేకుంటే డైరీ రాసుకుంటాను. నువ్వుంటే, నీతో చెప్పుకుంటాను. ఈ రెండు మార్గాల్లోనూ ఏదో ఒక మార్గంలో నా ఆవేదన, అశాంతి బైటికిపోవాలి. లేకపోతే బ్రతకలేను." అనేవాడు కార్తికేయమూర్తి.

ఈ విశాల భారతదేశంలో, ఒక మధ్య తరగతి కుటుంబీకుడి కథే కార్తికేయమూర్తి కథ. అవే సమస్యలు, అదే బ్రతుకు బరువు, ఎనమండుగురు జీవాలకు వాడు ఒక్కడే ఆధారం. మునిసిపల్ ఆఫీసులో గుమాస్తా. లంచాలు చాకచక్యంగా తినగల స్తోమతలేనివాడని భావించి, ఆ అవినీతి కూపంలో అక్కడక్కడ మిగిలిపోయిన అతి పవిత్రమైన సీట్లలో ఒకటి కేటాయించారు వీడికి. 'వృద్ధనారీ పతివ్రతాః' లంచాలు తినకూడదనే కఠిన నియమం ఏమీలేదు వీడికి. ఉన్నా, తన పరిస్థితులకి తల ఒగ్గి ఆ నియమంతో రాజీపడి వుండేవాడే ఎటొచ్చీ, వీడు పనిచేసే సీటు ఎవరికీ అవసరంలేదు. ఇసకలోంచి తైలం పిండగల సామర్థ్యం వున్నవాళ్ళు ఈ సీట్లోనుంచైనా ఎంతో కొంత పిండుకోగలరు. వీడికి ఆ పాటి చాకచక్యమే ఉంటే విడి కథ అతి సామాన్యుడి కథ అయివుండేది కాదు.

అప్పులు, సమస్యలతోపాటు సెంటిమెంట్లు, సంప్రదాయాలు, వేటినీ వదులుకోలేని, దేన్నీ భరించలేని త్రిశంకుస్వర్గం లాంటి జీవితం.

తన సమస్యలకు చావొక్కటే పరిష్కారం అని నన్ను వొప్పించేందుకు ప్రయత్నం చేస్తూ వుండేవాడు. నేనూ మధ్యతరగతి వాణ్ణే. మరీ వాడికి వున్నంత బరువు లేకపోయినా, నాకు సమస్యలు, సంఘర్షణ, అలసట అంటే బొత్తిగా తెలియనివి కావు. ఏమైనా చావు సమస్యల్ని పరిష్కరిస్తుందంటే వొప్పుకోలేకపోయేవాణ్ణి. ఇప్పటికీ ఒప్పుకోలేను.

"నేను బతుకుతున్నదే కుటుంబం కోసం అని నీకూ తెలుసు. నాకు చావంటే సరదాకాదు. కానీ, నేను వాళ్ళ కోసం బ్రతికి వుండి, వాళ్ళకి తిండికూడా పెట్టలేక, పస్తులతో చంపేసేకన్నా, నేనుపోతే ఇన్సూరెన్సనీ, గ్రాట్యుటీ అనీ" ఇలా నడిచేది ఆర్గ్యుమెంటు.

"ఏదీ, పోనీ, చావు తప్ప మరో పరిష్కారం సూచించు చూద్దాం" అని ఛాలెంజ్ చేసేవాడు. నేను, వాడి ప్రశ్నకు సూటిగా సరైన సమాధానం చెప్పలేకపోయేవాణ్ణి, ఇప్పటికీ చెప్పలేను. నేను అలాంటి మరో పరిష్కారం ఏదైనా సూచించగలిగితే, దేశాన్నే ఉద్ధరించగలను కదా! అయినప్పటికీ, మృత్యువు జీవిత సమస్యకి సమాధానం అంటే అంగీకరించలేను.

తన పెద తండ్రి, మామగారు ఇంకా ఒకరిద్దరు స్నేహితులు వీరంతా తనను ఈ ఆర్థిక వలయం నుంచి రక్షించే స్తోమతగలవారై వుండికూడా, రక్షించడం లేదని వాడి ఫిర్యాదు.

"నేనేం వ్యసనపరుణ్ణి కాదే ఈ కుటుంబాన్ని ఇంతదూరం ఈదడానికి అయిన అప్పులకి నేను చెల్లించే వడ్డీకి జమ అయిపోతుంది నా జీవితమంతా. ఆ అప్పుల్ని తీర్చేసి వడ్డీల బారినుంచి నన్ను రక్షించవచ్చుగా? నా జీతంతో మరికొద్ది కాలం ఈడ్చేసరికి తమ్ముడు అందివస్తాడు. చెల్లెళ్ళ పెళ్ళికి సహాయం చేస్తానన్న పెదనాన్న నాకు ఊపిరిపొయ్యడానికి ఎందుకు సహాయం చేయకూడదూ? వాళ్ళంతా దుర్మార్గులు కాదురా! నా పరిస్థితిని నమ్మడం లేదంతే. మీరెవరైనా, ఆదుకోకపోతే చచ్చిపోతాను అని నేను సిగ్గు విడిచి చెప్పాను. చెప్పానందరికీ, "ఆఁ మరీ అంత మునిగిపోయే పరిస్థితా ఏమిటీ అనే నిర్లిప్తత."

ఉత్తరాలన్నీ చదివాను, ప్రపంచంలో ఎవ్వరూ తన పరిస్థితి తాలుకు ప్రమాదాన్ని విశ్వసించలేదనే ఫిర్యాదు ప్రతీ ఉత్తరంలోనూ ఉంది.

వాడు ప్రతి చిన్న సమస్యనీ భూతద్దంలోంచి చూసి బెంబేలు పడిపోయే స్వభావం వున్నవాడు అని నాతో సహా అందరికీ ధృఢ విశ్వాసం. ఎందుకంటే ఈ సమస్యలు వాడొక్కడికే లేవు. అందరూ చావు గురించి ఆలోచించడం లేదు మరి.

"నేను మిమ్మల్ని నమ్మించగలిగితే, ఆ తర్వాత నేనుండను. మీ నమ్మకం, నా జీవితం కలిసి బ్రతకలేవు" ప్రతీ ఉత్తరంలోనూ ఈ వాక్యం అండర్‌లైన్ చేసి వుంది.

"అయితే మీ ఎదురుగా ఆత్మహత్య చేసుకోను. మీకు దూరంగా పోతున్నాను. బహుశా మరి కనిపించను, శెలవు"

"సారాంశం అంతేనమ్మా! అంతమాత్రాన మనం అలాగే జరిగి వుంటుందని నిశ్చయించనక్కర్లేదు." బలహీనంగా నా కంఠం నాకే. నాకే లేని నమ్మకాన్ని నేను వాళ్ళకెలా కలుగజెయ్యను?

"ఏం చేద్దాం?" ఏడుపుతో బేలగా అడిగారు వాళ్ళు. సడన్‌గా విశ్వపతి గుర్తుకు వచ్చాడు. చిరాకేసింది నాకు. అయిందానికీ, కాని దానికీ విశ్వపతి బుర్రమీద ఆధారపడటం అలవాటైపోయింది నాకు. ఇది మానసిక బానిసత్వం కాదూ? కాకుంటే ఈ సందర్భంలో విశ్వపతి ఎందుకు గుర్తుకు రావాలీ? ఇదేమైనా ఇంటలెక్చువల్ ప్రాబ్లమా? అతను తన తెలివితో ఎనలైజ్ చేసి చెప్పడానికి? మృత్యుచ్ఛాయలో బ్రతుకుని ఓదార్చడానికి కూడా విశ్వపతి తెలివితేటలు కావాలా? స్పందించే హృదయం ఉంటే చాలదూ?

"ప్రస్తుతానికి ఒకటి రెండు రోజులు మాట్లాడకుండా ఊరుకుందాం. ఈలోగా బంధువులకి వర్తమానం పంపుదాం. విషయం మాత్రం పైకి పొక్కకూడదు. ఈ ఉత్తరాలు గాని, ఈ సంగతి గాని బైటికి పొక్కి, ఏం జరిగినా, జరక్కపోయినా, వాణ్ణి ఆత్మహత్యా ప్రయత్నం క్రింద జైల్లో పెడతారు. ఒకవేళ ఏదైనా ఎలాగా తెలుస్తుంది మనకి" చివరి మాటలంటున్నప్పుడు నాకు ఏడుపు వచ్చింది.

"రెండు రోజులైంది. ముందు నీతో చర్చించవలసినది ఏమీ లేదనుకున్నాను గాని, ఇప్పుడేం చెయ్యాలో తోచడంలేదు. వాడు చేసిన వెధవపనికి ఆడవాళ్ళు అలో లక్ష్మణా అని మొత్తుకుంటున్నారు. అయిన వాళ్ళంతా దిగారు. ఇక ఎంతోకాల గుట్టు గుప్పెట్లో ఇమిడేలా కనబడలేదు." విషయమంతా వివరంగా చెప్పాను విశ్వపతికి.

విశ్వపతి నవ్వలేదు. కార్తికేయమూర్తి 'వ్యవస్థ' అని రాసివుంచిన ఇరవై పేజీల గోడు చదివాడు. చాలా దీర్ఘంగా ఆలోచిస్తూ వుండిపోయాడు.

"సానుభూతి చూపించడం చేతకాదు సమాజానికి" చాలా సీరియస్‌గా అన్నాడీమాట విశ్వపతి. విశ్వపతి ఏ విషయం గురించైనా అంత గంభీరంగా మాట్లాడడం అదే మొదటిసారిగా చూస్తున్నాను. ఎంత లోతైన సమస్యనైనా అలవోకగా వివరించే విశ్వపతి అలా మాట్లాడేసరికి, ఇంక కార్తికేయమూర్తిని మరి చూడలేనేమో అనిపించి గుండె గుబగుబలాడింది.

"అనుభూతి అనేది హృదయానికి సంబంధించినది. దానికి సిద్ధాంత రాద్ధాంతాలతోనూ, రీజనింగ్‌తోనూ సమాధానం చెప్పకూడదు. ఏ సమస్యకీ చావు పరిష్కారం కాదు. నిజమే. కానీ, ఈ విషయాన్ని ఆ సమస్యని ఫీలవుతున్నవాడికి చెప్పకూడదు. ఆ వ్యక్తి స్పందనకి అంతే డిగ్రీలో ప్రతిస్పందిస్తూ, అప్పుడు చర్చలోకి దిగాలి. ఓదార్పు ముఖ్యం

తన సమస్య పట్ల ఏవరికీ సదవగాహన లేకపోయిందన్న బాధ ఎక్కువ కలిగింది కార్తికేయుడికి, ఎవ్వరూ అతనికి సహాయం చెయ్యనక్కర్లేదు. 'అయ్యో! ఎంత దారుణమైన పరిస్థితి. ఏదో చెయ్యాలి. ఏం చేద్దాం?' అంటూ అతని వేదనని పంచుకునే ప్రయత్నం చెయ్యలేదెవ్వరూ. నువ్వు కూడా.

"అవునా! నిజమే చూడబోతే ముంచుకొచ్చేలాగే ఉంది. ఏం చేద్దాం? ఓ పనిచేస్తే?' అని మొదలు పెట్టు చాలు. తనని నువ్వు నమ్మినట్లు అతనికి అనిపిస్తే చాలు. సగం వేదన తగ్గుతుంది. సమస్య మానసికంగా బాధపెట్టడం మానేస్తుంది. ఈసారి అలా చెయ్యి" అన్నాడు విశ్వపతి.

"ఈసారికి ఇంకేం మిగిలింది?" అన్నాను, ఏడుపు ఒక్కటే తరువాయి.

నవ్వాడు విశ్వపతి.

"కార్తికేయుడు చచ్చిపోలేదు. ఇవాళో రేపో వచ్చేస్తాడు. తన కీర్తికాయాన్ని స్వయంగా చూసుకునేందుకు."

"అంటే?"

"తన కుటుంబానికి అవసరమైనప్పుడు సహాయం చెయ్యడానికి సిద్ధంగా వున్న పెదనాన్న వున్నాడా? మరెందుకు చెయ్యలేదు? ఆ 'అవసరం' సరిగా ఫీలవక. ఇప్పుడు దారుణంగా ఫీలయిపోతున్నాడు గదా?"

"కన్నబిడ్డను ఇచ్చిన మావగారు, స్థితిపరుడై ఉండీ ఎందుకు ఆదుకోలేదూ? అల్లుడి ఫీలింగ్‌ని తను నమ్మలేక. నమ్మక తప్పని స్థితి వచ్చిందిగా ఇప్పుడు?

"తనను అభిమానించే సమర్దులైన స్నేహితులు కూడా సహాయం హస్తం చాచలేదెందుచేతా? ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నారా, లేదా?

"అయ్యో నిజంగా వాడింత బతకలేని దౌర్భాగ్యస్థితిలో వున్నాడనుకోలేదు. అనుకుని వుంటే కాస్త డబ్బు కోస్మ వాడి బతుకుని బలి చేసుకుందుమా?" అని పశ్చాత్తాప పడుతున్నారా లేదా? ఈ తతంగం అంతా అతడి చావు తర్వాత గదా?

"నువ్వు ఈ అయినవాళ్ళకి తెలియజెయ్యవలసింది ఏమంటే, సహాయం చేసినా మానినా, సానుభూతి చూపించడంలో తమ తెలివితేటల్ని, అనుభవాల్ని, నమ్మకాల్ని కాక కేవలం హృదయాన్ని మాత్రం ఉపయోగించమని.

"ఇంక సమస్య పరిష్కారమూ అంటావా? నీకు తెలియకపోతే నా దగ్గరకు తీసుకురా! ఎకనమిక్స్, పసిఫిక్ మహాసముద్రం కన్నా లోతైన సబ్జక్టు. బతకాలనే 'ప్రయత్నం' చేసేవాడికి లక్షదార్లు. అతనికి తాను కేవలం ఒకానొక గుమాస్తా మాత్రమేకాదనీ, ఆర్థిక మహాసముద్రంలో ఈదడానికి అర్హత, అవకాశం వున్న 'మగవాడు' అనీ తెలియజేస్తాను."

"ఇంతకీ కార్తికేయుడు బతికే వున్నాడని ఎలా చెబుతున్నావు, అంత ఖచ్చితంగా?"

"వెరీ సింపుల్. ఆత్మహత్యకు ప్రేరేపించేది ఆలోచనకాదు. ఒక ఆవేశం. అది క్షణికం. ఆ క్షణంలో ఆ ఆవేశపు ఉధృత తరంగం ఎగిసిపడే ఆ 'స్పర్ ఆఫ్ ది మూమెంట్‌లో,' ఆ స్ప్లిట్ సెకెండ్‌లో, ఆ ఎమోషనల్ వెహెమెన్స్‌లో, ఆ ఉన్మాదపు మత్తులో హఠాత్తుగా

జరిగిపోయే విషయం. ఆత్మహత్యకు పాల్పడ్డవాడు, అయిదురోజులు ఆలోచించి, ఒక నవలకు సరిపోయేంత మేటర్ రాసి వెళ్ళాడు. అతను రాసిన ప్రతీ అక్షరంలో తనని తాను సమర్థించుకోవడం, అందరూ తనను విశ్వసించితే బాగుండేది అన్న ఫిర్యాదు చెయ్యడం కనిపించడంలేదూ?

"ఆ తనయొక్క 'పోస్టుమార్టం రిపోర్ట్'ని స్వయంగా చదువుకోవాలనే ఉత్సుకత ఉంటుంది ఇలా ఆత్మహత్య నాటకం ఆడిన వాడికి.

"ఇంక అతను ఎందుకు తిరిగి వస్తాడంటావా? విశాల ప్రపంచంలోకి, పరారీ అయిపోయాడనుకో, ఇందాకా నేను చెప్పినట్లు, తన సమస్యకి లక్షదార్లలో ఏదో ఒక దారి అతనికే స్వయంగా కనిపించినా ధైర్యంగా, ఎకనమిక్స్ నేర్చుకున్నవాడిలా, సముద్రపు లోతుల్లో ఈదగలిగిన వాడిలా, రత్నాల అన్వేషకుడిలా తిరిగివస్తాడు, లేదూ ఆ పూట భోజనం ఎలా సంపాదించుకోవాలో తెలుసుకోలేక, ఇక్కడ చిన్న గుమాస్తాగా బతికెయ్యడానికైనా వచ్చేస్తాడు. ఎ ప్రాడిగల్ సన్ షుడ్ రిటర్న్ హోమ్. ఎ ప్రాస్పరస్ నేవిగేటర్ ఆల్సో రిటర్న్ హోమ్"

కార్తికేయుడు క్షేమంగా తిరిగి వచ్చాడు.

చాలాకాలం బ్రతికాడు. ఇంకా బ్రతికే వున్నాడు సమస్యల్లో తేలుతూ సమస్యల్లో మునుగుతూ, సమస్యల్లో ఈదుతూ.. సమస్యలతో పోరుతూ..

బ్రతుకుతూ, బ్రతుకుకోసం,

బ్రతికే వున్నాడు.

(సమాప్తం)

Post your comments